VOICE OF PRAJALU
వాయిస్
ప్రజల గొంతుక - నిజం కోసం.. ఆఫ్ ప్రజలు

కరీంనగర్‌ను ఆదర్శ నగరంగా తీర్చిదిద్దుతా..

కేంద్రం నుండి మరిన్ని నిధులు తీసుకొస్తా

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధిలో కలిసి రండి

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ వెల్లడి

మేయర్, డిప్యూటీ మేయర్‌తో కలిసి

రూ.78 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కరీంనగర్, అక్టోబర్ 27(వాయిస్ టుడే): అభివృద్ధి,క్లీన్ అండ్ గ్రీన్ లో కరీంనగర్ కార్పొరేషన్ ను తెలంగాణలోనే ఆదర్శంగా నగరంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతోనే చిత్తశుద్ధితో కృషి చేస్తున్నానని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. అందులో భాగంగా కేంద్ర, రాష్ట్రాల సహకారంతో పెద్ద ఎత్తున నిధులు తీసుకొస్తున్నామని పేర్కొన్నారు. పార్టీలకు,రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ కరీంనగర్ కలిసి రావాలని, అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. కరీంనగర్ పర్యటనలో భాగంగా కార్పొరేషన్ పరిధిలోని 4వ డివిజన్ దుర్శేడ్ గోపాల్ పూర్ లో రూ.78 లక్షల యూఐడీఎఫ్ నిధులతో డ్రెయిన్,సీసీ రోడ్డు పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, స్థానిక కార్పొరేటర్ భూపతి రవీందర్ లతో కలిసి శంకుస్థాపన చేశారు.అనంతరం స్థానిక ఆలయాన్ని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే యూఐడీఎఫ్ కింద 50 కోట్ల రూపాయలు వచ్చినయ్.ఆ నిధులతో సీసీ రోడ్లు,డ్రెయిన్ పనులను స్టార్ట్ చేసినం.ఈ స్కీం కింద మరో 30 కోట్ల రూపాయలు కూడా రాబోతున్నయ్.నగరంలో గల్లీగల్లీలో సీసీ రోడ్లను,డ్రెయిన్లను నిర్మిస్తాం.అట్లాగే స్మార్ట్ సిటీ కింద 900 కోట్ల రూపాయల నిధులను తీసుకొచ్చి కరీంనగర్ ను స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దినం.ఇవిగాకుండా అమ్రుత్ 1, 2 కింద 279 కోట్ల రూపాయలు ఖర్చు చేసినం.అట్లాగే అర్బన్ డెవలెప్ మెంట్ ఫండ్ కింద రూ.50 కోట్లు వచ్చినయ్.వాటితో గల్లీల్లో రోడ్లు,ఇతర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినం. తీగలగుట్టపల్లి ఆర్వోబీ నిర్మాణం కోసం కేంద్రమే పూర్తిగా 156 కోట్లను మంజూరు చేసింది.శరవేగంగా పనులు జరుగుతున్నాయి. ఇవిగాకుండా 840 కోట్ల యూసీఎఫ్ నిధులతో కరీంనగర్ కార్పొరేషన్ రూపురేఖలే మారబోతున్నాయి. కరీంనగర్ లో మోడల్ రోడ్లను నిర్మిస్తాం.స్కై వాక్ లు,ఫుట్ ఓవర్ బ్రిడ్జి లను నిర్మిస్తాం,నాన్ మోటరైజ్డ్ ట్రాన్స్ పోర్ట్ (మోటార్,ఇంధనం ఉపయోగించే రవాణా వాహనాలు) వాహనాలను అందుబాటులోకి తీసుకొస్తాం. కరీంనగర్ శివారు ప్రాంతాల్లోని గల్లీగల్లీలో సీసీ రోడ్లను నిర్మిస్తాం.అభివృద్ధిలో తెలంగాణలోనే కరీంనగర్ ను ఆదర్శంగా తీర్చిదిద్దడంతోపాటు సుందర నగరంగా మార్చబోతున్నాం. ఈ సందర్భంగా మీ అందరినీ కోరేదొక్కటే. ఎన్నికల వరకే రాజకీయాలు. ఎన్నికల తరువాత అభివృద్దే ముఖ్యం.నాకు భేషజాల్లేవు.రాజకీయ తారతమ్యాలు లేవు.అందరం కలిసికట్టుగా పనిచేస్తూ ప్రజల ఆకాంక్షలను నెరవేరుద్దాం.అభివృద్ధి విషయంలో రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేస్తా అన్నారు.

ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో నీటిని పొదుపుగా వినియోగించండి

మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్

జమ్మికుంట అక్టోబర్ 27 (వాయిస్ టుడే): జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ పట్టణ ప్రజలందరికీ నమస్కారాలు తెలుపుతూ ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావం కారణంగా ఉష్ణోగ్రతలు పెరిగి,నీటి సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కోరుతు ప్రభుత్వ సూచనల మేరకు ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించుకోవాలి, ప్రతిరోజూ నల్లా ద్వారా సరఫరా చేసే నీటిని అవసరమైనంత మాత్రమే వినియోగించాలి అన్నారు. ప్రతి ఇంట్లో నీటిని నిల్వ చేసుకునేందుకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలి నీటిని వృథా చేయకుండా, మిగిలిన నీటిని సాధ్యమైనంతవరకు తిరిగి ఉపయోగించుకోవాలి అలాగే,ఇళ్లను శుభ్రం చేయడానికి,బట్టలు ఉతకడానికి ఉపయోగించే నీటిని వృథా చేయకుండా, సాధ్యమైన చోట నిల్వ చేసుకుని ఇతర అవసరాలకు వినియోగించాలి అని తెలిపారు. ప్రతి ఒక్కరూ నీటి సంరక్షణలో భాగస్వాములు అయి ఎల్‌నినో ప్రభావంతో తీవ్రమైన ఎండలు,అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నందున ప్రజలు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి అవసరమైన జాగ్రత్తలు పాటిస్తూ,ఎండ తీవ్రత సమయంలో బయటకు వెళ్లకుండా ఉండాలి ప్రభుత్వం సూచనలు పాటిస్తూ ప్రతి ఒక్కరూ సహకరించాలని తెలిపారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల ఆందోళనకు జనసేన సంఘీభావం

ఉద్యోగ భద్రత, న్యాయమైన హక్కులు కల్పించాలి: డా. బండారి రాజ్‌కుమార్

సిరిసిల్ల: తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఆందోళన చేస్తున్న నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగులకు జనసేన నాయకుడు డా. బండారి రాజ్‌కుమార్ సంపూర్ణ సంఘీభావం ప్రకటించారు. ఎన్నో ఏళ్లుగా రాష్ట్ర వైద్య ఆరోగ్య వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తూ ప్రజలకు సేవలందిస్తున్న ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదని ఆయన అన్నారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిగణనలోకి తీసుకోవాలని, వారి ప్రతినిధులతో చర్చలు జరిపి సమస్యల పరిష్కారానికి స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరంతరం ప్రజలకు వైద్య సేవలందిస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రతతో పాటు న్యాయమైన హక్కులు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి చర్చల ద్వారా శాశ్వత పరిష్కారం చూపాలని డా. బండారి రాజ్‌కుమార్ కోరారు. ఉద్యోగులకు న్యాయం జరిగినప్పుడే వైద్య ఆరోగ్య వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు రంజిత్, సిరిసిల్ల జిల్లా నాయకులు నరేష్ నేరెళ్ల, మడిశెట్టి రోహిత్ తదితరులు పాల్గొని ఆందోళన చేస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు మద్దతు తెలిపారు.

అయ్యప్ప భక్తులకు సేవ చేసే అవకాశం దక్కడం పూర్వజన్మ సుకృతం

శబరిమల మహా పాదయాత్రను ప్రారంభించిన బండి సంజయ్ కుమార్

కరీంనగర్,అక్టోబర్ 27(వాయిస్ టుడే): అయ్యప్ప స్వామికి సేవ చేసే అవకాశం అందరికీ దక్కదని,వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ భక్తులకు అండగా నిలవడం మనందరి బాధ్యత అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పేర్కొన్నారు.కరీంనగర్ భగత్ నగర్ లోని హరిహర క్షేత్రం శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో అయ్యప్ప స్వాములు శబరిమల మహా పాదయాత్ర ప్రారంభించనున్న సందర్భంగా పాదయాత్రలో పాల్గొనే అయ్యప్ప స్వాములను సన్మానించారు.ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ అయ్యప్ప స్వాముల యాత్రకు సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షించడం,స్వాములకు ఏ చిన్న ఇబ్బంది కలిగినా దాన్ని పరిష్కరించి సేవ చేయడం తన బాధ్యతగా భావిస్తున్నానని తెలిపారు.స్థానిక పాలకవర్గం,చైర్మన్,ఈఓ మరియు అధికారులు అయ్యప్ప భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.గడప నాగరాజు గురుస్వామి ఆధ్వర్యంలో వరుసగా 26వ సారి శబరిమలకు మహా పాదయాత్ర చేపట్టడం అత్యంత అభినందనీయమని కొనియాడారు. నాలుగు,ఐదు రాష్ట్రాలు దాటుకుంటూ,వేల కిలోమీటర్లు నడిచి శబరిమల చేరుకోవడం సాధారణ విషయం కాదని,స్వామివారి కృపాకటాక్షాలు ఉండడం వల్లనే ఇది సాధ్యమవుతోందని అన్నారు.యాత్రలో తొందరపాటు,ఆతురత లేకుండా ప్రశాంతంగా,సురక్షితంగా ముందుకు సాగాలని కోరారు.వేకువజామున లేదా అర్ధరాత్రి వేళల్లో పాదయాత్ర చేయవద్దని సూచించారు.జాతీయ రహదారులపై వాహన చోదకులు నిద్రమత్తులో ఉండే ప్రమాదం ఉన్నందున రాత్రి వేళల్లో ప్రయాణాన్ని నివారించాలని సూచించారు. పాదయాత్ర మార్గంలో స్వాములకు ఎలాంటి సమస్య ఎదురైనా,ఇతర రాష్ట్రాల అధికారులతో మాట్లాడి సదుపాయాలు కల్పించడానికి తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు.ఈ యాత్ర ఎంతో మందికి స్ఫూర్తిదాయకంగా నిలవాలని, భక్తులందరూ క్షేమంగా శబరిమల చేరుకుని స్వామివారి దర్శనం ముగించుకుని తిరిగి రావలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్,బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి డిప్యూటీ మేయర్ మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు,ఆలయ కమిటీ చైర్మన్ యాగండ్ల అనిల్ కుమార్ గౌడ్, ఈ.వో కాంతారెడ్డి,ప్రధాన పురోహితులు రాజయ్య, పురోహితులు,ధర్మకర్తలు, గురుస్వాములు,అయ్యప్ప భక్తులు, కార్పొరేటర్లు,ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మధు గౌడ్ యాష్కీకి బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి శుభాకాంక్షలు

హైదరాబాద్: ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ (ఏఐపీసీ) చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన మధు గౌడ్ యాష్కీని తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి, హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

రక్త దానం ఇంకొకరి ప్రాణాధారం

పోలీస్ అమరవీరుల సంస్మరణ

రక్తదాన శిబిరంలో సీపీ గౌస్ ఆలం

కరీంనగర్,అక్టోబర్ 27(వాయిస్ టుడే): పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా కరీంనగర్ లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు.విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ,మానవతా దృక్పథంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ రక్తదానం మరొకరి ప్రాణాన్ని కాపాడే మహోన్నత సేవ అని పేర్కొన్నారు. ప్రజల ప్రాణాలను రక్షించడం పోలీసుల ప్రధాన కర్తవ్యమని, అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందించడం ద్వారా విలువైన ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు.ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.రక్తదానానికి కులం మతం,ప్రాంతం,లింగభేదాలతో సంబంధం లేదని,ఇది మానవత్వానికి,సమానత్వానికి ప్రతీకగా నిలుస్తుందని సీపీ పేర్కొన్నారు.ముఖ్యంగా రోడ్డు ప్రమాదాలు,ఇతర అత్యవసర పరిస్థితుల్లో గాయపడిన వారికి సకాలంలో రక్తం అందించడం ఎంతో కీలకమని తెలిపారు.రక్తదానం చేసే ముందు వైద్య పరీక్షలు చేయించుకోవాలని,అనంతరం వైద్యుల సూచనల మేరకు తగిన విశ్రాంతి తీసుకోవాలని సూచించారు.ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న నిర్వహించే పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసు సిబ్బంది సేవలను స్మరించుకుంటామని తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఇప్పటివరకు 47 మంది పోలీసు సిబ్బంది విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించారని,వారి త్యాగాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.అమరవీరుల కుటుంబాలను గౌరవించడం,వారి త్యాగాలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ రక్తదాన కార్యక్రమంలో ఏసీపీ లు శ్రీనివాస్,జి.వెంకటస్వామి విజయకుమార్ పాల్గొన్నారు.

తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణంపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి

బీఆర్ఎస్ విమర్శలను తీవ్రంగా ఖండిస్తున్నాం

డీసీసీ అధికార ప్రతినిధి అనంతుల రమేశ్

కరీంనగర్,అక్టోబర్ 27(వాయిస్ టుడే): తెలంగాణ రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణంపై దృష్టి సారించడం శుభపరిణామమని కరీంనగర్ డీసీసీ అధికార ప్రతినిధి అనంతుల రమేశ్ అన్నారు.రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తెలంగాణ ప్రతినిధి బృందంతో కలిసి మహారాష్ట్రకు వెళ్లి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్‌తో ప్రాజెక్టు నిర్మాణంపై చర్చలు జరపడం హర్షణీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూతుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణం పూర్తయితే తెలంగాణతోపాటు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సాగునీటి అవసరాలు తీరేందుకు దోహదపడుతుందని తెలిపారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నారని చెప్పారు.మహారాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం ఆశాజనకమన్నారు. బ్యారేజీ నిర్మాణానికి సంబంధించిన చర్చలు సఫలమై ప్రాజెక్టు కార్యరూపం దాలిస్తే రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.బ్యారేజీ ఎత్తు 150 మీటర్లకు సంబంధించి కూడా చర్చలు జరుగుతున్నట్లు తెలిపారు. గత పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నాయకులు తుమ్మిడిహట్టి బ్యారేజీ విషయంలో ఆశించిన స్థాయిలో ముందడుగు వేయలేదని అనంతుల రమేశ్ విమర్శించారు.రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రెండేళ్లలోనే మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరిపి ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తుండటాన్ని బీఆర్ఎస్ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారని ఆరోపించారు.ఎల్లంపల్లి ప్రాజెక్టుకు గ్రావిటీ ద్వారా నీరు అందుబాటులోకి వస్తే కాళేశ్వరం ప్రాజెక్టు ప్రాధాన్యం తగ్గుతుందనే భయంతోనే బీఆర్ఎస్ నాయకులు ఆరోపణలు చేస్తున్నారని అనంతుల రమేశ్ అన్నారు.రైతుల ప్రయోజనాల కంటే రాజకీయ విమర్శలకే వారు ప్రాధాన్యం ఇస్తున్నారని మండిపడ్డారు.ప్రజలు, రైతులు బీఆర్ఎస్ నాయకులపై విశ్వాసం కోల్పోయారని, అందుకే గత ఎన్నికల్లో ఆ పార్టీని అధికారానికి దూరం చేశారని వ్యాఖ్యానించారు.

దళారుల చేతుల్లో రైతులు మోసపోవద్దు

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

ఇల్లంతకుంట,అక్టోబర్ 27(వాయిస్ టుడే): ధాన్యం విక్రయాల విషయంలో రైతులు దళారుల చేతుల్లో మోసపోవద్దని మానకొండూరు ఎమ్మెల్యే,టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సూచించారు. ఇల్లంతకుంట మండలంలోని వంతడ్పుల,అనంతారం గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే తమ పంటను విక్రయించాలని కోరారు.మహిళా సంఘాల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను నిర్వహిస్తున్నందున పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. ధాన్యం తూకంలో కోతలు,తేమ శాతం నిర్ధారణలో మోసాలకు తావులేకుండా కొనుగోళ్లు చేపడతామని స్పష్టం చేశారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన డబ్బులు 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో జమయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యమని,ఆ ఆశయ సాధనలో భాగంగానే మహిళా సంఘాలకు ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తున్నట్లు వివరించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమాల్లో ఇల్లంతకుంట పీఏసీఎస్ చైర్మన్ ఊట్కూరి వెంకటరమణారెడ్డి,వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సప్తగిరి సాహిత్య వినయ్ కుమార్,వైస్ చైర్మన్ భరత్ రెడ్డి,మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, సర్పంచులు లావణ్య రవి,మామిడి రాజు,నేరెళ్ల విజయ్,పసుల వెంకటి పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా రక్తదానం

పాతకాల ప్రవీణ్ ఆధ్వర్యంలో యువత స్వచ్ఛంద రక్తదానం

హుజూరాబాద్ అక్టోబర్ 27 (వాయిస్ టుడే): పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో హుజురాబాద్ క్లబ్ ఆఫీస్ లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో జమ్మికుంట యువత ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు. హుజూరాబాద్ ఏసీపీ మాధవి, జమ్మికుంట పట్టణ సీఐ రామకృష్ణ గౌడ పిలుపు మేరకు పాతకాల ప్రవీణ్ ఆధ్వర్యంలో జమ్మికుంటకు చెందిన యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రణయ్, శ్రీకాంత్, కుమార్, విజయ్, హరీష్, మహేష్, తరుణ్, వినీత్, రాజకుమార్, కిరణ్, విక్రమ్, శ్రీనాథ్, ప్రమోద్, రాజ్ కుమార్, సురేష్, వీరస్వామి, ప్రదీప్ తదితర యువకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యువత మాట్లాడుతూ, రక్తదానం ప్రాణదానంతో సమానమని, మనం ఇచ్చే రక్తం మరొకరి ప్రాణాలను కాపాడుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ రక్తదానంపై అవగాహన పెంపొందించుకొని, అవసరమైన వారికి సహాయం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సమాజ సేవలో యువత ఎల్లప్పుడూ ముందుండాలనే లక్ష్యంతో పాతకాల ప్రవీణ్ ఆధ్వర్యంలో యువకులు ఈ రక్తదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.